క్లుప్తంగా

వాహనాల తనిఖీ



స్కూల్ బస్‌ను పరిశీలిస్తున్న ఆర్‌టీవో

నింద్ర : వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవని చిత్తూరు ఆర్‌టీవో సునీల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనదారులతో మాట్లాడుతూ.. వాహన చోదకులు ప్రభుత్వ నిబంధనలు పాటించి, అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలు వాహనాల రికార్డులు పరిశీలించారు.

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ మార్గేట్

పాలసముద్రం : ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ మార్గేట్ తెలిపారు. బుధవారం ఉపాధిహామీ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి పథకంలో చేస్తున్న పనుల వివరాలకు సంబంధించి సచివాలయంలో పనుల ఐడీ నెంబర్‌తో పాటు పనులు వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా ప్రతి పంచాయతీలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల నిర్లక్ష్యం వల్లే మండలంలో కూలీల సంఖ్య తగ్గిందన్నారు. కార్యక్రమంలో జేఈ అనుషా, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సామాజిక సేవ



ఆస్పత్రిలో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

నగరి : ప్రతి బుధవారం ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చే గర్భిణులకు మాజీ మంత్రి రోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా పౌష్టికాహారం అందిస్తూ సామాజిక సేవలు కొనసాగిస్తున్నారు. ఇది ఎన్నికల కోసం చేపట్టి అనంతరం ఈ కార్యక్రమాన్ని అర్ధంతరంగా వదిలేయలేదు. నగరి, పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహారం ప్రతి బుధవారం అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు.

'పొలం పిలుస్తోంది' సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మోహన్ మురళి

వెదురుకుప్పం : మండల పరిధిలోని రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం చవనపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణ మాట్లాడుతూ.. వ్యవసాయాధికారుల సూచన మేరకు పంటలు సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వెదురు కుప్పం క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్ మురళి, అధికారులు రమేష్, రెడ్డి, పశువైద్యులు రాజేష్, స్పాసైటీ సీఈవో రమేష్, మండల వ్యవసాయాధికారి, సర్పంచ్ బాబు, రైతులు పాల్గొన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం



తూగుండ్రంలో మురుగు నీటి సమస్యను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

గంగాధర నెల్లూరు : సాక్షి దినపత్రికలో మురుగుతో అవస్థలు అనే శీర్షికతో మంగళవారం కథనం ప్రచురితమైంది. ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీలో మురుగు కాలువను జిల్లా, మండల స్థాయి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుండ్రం గ్రామంలో మురుగు ద్వారా ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిశీలించామని తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారం దిశగా కలెక్టరుకు నివేదిక సమర్పిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు, ఎంపీడీవో హరి ప్రసాద్, ఏఈ ఈశ్వర్, కార్యదర్శి మురళి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ఆనందాల కేళి

- నేడు దీపావళి పండుగ
- టపాసులతో అజాగ్రత్త వద్దంటున్న ఆధికారులు
- జాగ్రత్తలతోనే ప్రమాదాలు దూరం



గత దీపావళిలో కుటుంబ సభ్యులతో కలసి వెలిగిస్తున్న కాకరపూలు

పాలసముద్రం : చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా ఆనందోత్సాహాలతో జరుపుకొనే దీపావళి పండుగ రానే వచ్చింది. ఈ సందర్భంగా టపాసులు కాల్చేటప్పుడు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదమే. దీపావళి ప్రతి ఇంటా ఆనందాల కాంతులు వెదజల్లాలంటే జాగ్రత్తలు తప్పనిసరి. మరోవైపు బాణసంచా దుకాణదారులు సైతం అజాగ్రత్తగా వ్యవహరించడానికి వీలు లేదని అధికారులు హెచ్చరిస్తున్నారు. గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని దుకాణాల వద్ద ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి చేశారు.

బాణసంచా విక్రయించే వ్యాపారులు ముందుగా పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారుల నుంచి అనుమతులు పొందాలి. ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకోవాలి. విక్రయ ప్రాంతంలో తప్పనిసరిగా ఇసుక, నీరు, కార్బన్‌డైయాక్సైడ్ వాయువులను అందుబాటులో ఉంచుకొనేలా చూడాలి. దుకాణాల సమీపంలో ఎవరూ సిగరెట్లు, బీడీలు కాల్చకుండా పొగ తాగరాదని సూచించే బోర్డులను ఏర్పాటు చేసుకోవాలి. అలాగే దుకాణాల సమీపంలో ఎవరూ సెల్‌ఫోన్‌లో మాట్లాడకుండా చర్యలు చేపట్టాలి. దుకాణాల మధ్య కనీసం పది అడుగుల దూరం ఉండేలా జాగ్రత్తలు పాటించాలి. మందుగుండు సామగ్రి విక్రయించే కేంద్రాల్లో విద్యుత్ సంబంధించిన వైరింగు సక్రమంగా ఉండేలా జాగ్రత్త వహించడంతో పాటు సాధ్యమైనంత వరకూ ఎల్‌ఈడీ బల్బులు వాడితే మంచిది. ప్రతి దుకాణం ఎదుట టపాసుల ధరల పట్టిక, అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నెంబర్లు తప్పకుండా ఉండేలా ఏర్పాటు చేసుకొంటే చాలా వరకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదు.



అమ్మకానికి సిద్ధంగా టపాసుల సామగ్రి

పెద్దల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చాలి :

గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాలు, గడ్డివాములు, పూరి గుడిసెలు ఎక్కువగా ఉంటాయి. కనుక అలాంటి చోట్ల రాకెట్లు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు కాల్చకుండా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. ప్రధానంగా టపాసులు కాల్చేటప్పుడు పిల్లల విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా జీవితకాలం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందుకే పెద్దల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చేలా చూసుకోవాలి. అలాగే నియోజకవర్గంలో సుమారు 55 బాణసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు అయినట్లు అధికారులు చెబుతున్నారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి



బాణసంచా విక్రయించే వ్యాపారులు ముందుగా పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్ వంటి అన్ని శాఖల అధికారుల నుంచి అనుమతి పొందిన తరువాతనే ఊరికి దూరంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. దుకాణం వద్ద కార్బన్‌డైక్సైడ్ వాయువు ఉంచుకోవాలి.

– అరుణకుమారి, తహసీల్దార్

అప్రమత్తంగా వ్యవహరించాలి



ప్రమాదాలనేవి ప్రారంభంలో చిన్నవిగానే ఉంటాయి. అందుకే బాణసంచా విషయంలో ఏ చిన్న ప్రమాదం జరిగినా అప్రమత్తంగా వ్యవహరించాలి. అందుబాటులో ఉన్న వనరులతో ప్రమాదాన్ని నివారించేందుకు ప్రయత్నించాలి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి లేదా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి.

– హనుమంతప్ప, కార్వేటినగరం, డివిజన్ సీఐ

తిమ్మాపురం డ్రైనేజీ సమస్య టీడీపీ పుణ్యమే





మాట్లాడుతున్న చైర్మన్ హరి, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

- సమావేశాలకు సచివాలయ సిబ్బంది రావాలి
- మున్సిపల్ సమావేశంలో చైర్మన్ హరి

పుత్తూరు : రెండవ వార్డు తిమ్మాపురంలో నెలకొన్న డ్రైనేజీ సమస్య టీడీపీ నాయకుల పుణ్యమేనని మున్సిపల్ చైర్మన్ హరి ఆరోపించారు. సమస్య పరిష్కారం నిమిత్తం చేపట్టిన పనికి కోర్టు నుంచి ఆటంకాలు కలిగించింది ఆ పార్టీ వారేనని స్పష్టం చేశారు. బుధవారం హరి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా తిమ్మాపురంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పార్టీలకు అతీతంగా పరిష్కరించాలని కోరారు. ఇందుకు దీపావళి అనంతరం కౌన్సిలర్‌లందరూ తిమ్మాపురం గ్రామంలో పర్యటించి డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఇకపై జరిగే ప్రతి మున్సిపల్ సమావేశాలకు అన్ని వార్డు సచివాలయాల సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని దీనిపై పోలీస్ శాఖతో సంప్రదించి తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ జీవరత్నంనాయుడు మాట్లాడుతూ.. తిమ్మాపురంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తమ పార్టీ అన్ని విధాలా సహకరిస్తుందని స్పష్టం చేశారు. సమ్మర్ స్టోరేజీ మరమ్మతుల కోసం మంజూరైన రూ.9 కోట్ల నిధులకు సంబంధించి రీ టెండర్ పిలవాలని కోరారు. పట్టణంలో శానిటేషన్ సమస్య తీవ్రంగా ఉందని 190 మంది సిబ్బందికి గాను 120 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. వెంటనే మరో 70 మందిని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ సంఘం ఉపాధ్యాయులు

నగరి : యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవ సంబరాల ర్యాలీని అసోసియేషన్ సభ్యులు బుధవారం నిర్వహించారు. నగరి ఓం శక్తి గుడి నుంచి టవర్ క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంబరాలు నిర్వహించారు. యూటీఎఫ్ ఉపాధ్యాయుల కోసం సాధించిన విజయాలను జిల్లా కమిటీ సభ్యులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్.మణిగండన్, సహ అధ్యక్షుడు పీఆర్ మునిరత్నం, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్‌పీ బాషా, జిల్లా కార్యదర్శి పార్థసారథి, ఆడిట్ కమిటీ సభ్యులు , నగరి, నింద్ర, విజయపురం మండలాల అధ్యక్షులు సంతోష్, శ్రీనివాసులు, రాజేష్, ప్రధాన కార్యదర్శులు, మహిళా కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం

వెదురుకుప్పం : మండలంలోని దిగువపల్లాలు పంచాయతీ ఆళ్లమడుగు ఎస్టీ కాలనీలో బుధవారం సర్పంచ్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తా చెదారం, పేడ దిబ్బలను తొలగించారు. ముళ్లకంపలను, రాళ్లను జేసీబీతో చదును చేసి శుభ్రం చేశారు. దీపావళి సందర్భంగా అన్ని వీధులు పరిశుభ్రం చేయించామని సర్పంచ్ ఆశీర్వాదం తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు పద్మనాభరెడ్డి, కార్యదర్శి పురుషోత్తం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌సీ ప్రభావతి

కార్వేటి నగరం : వైద్యసిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని డీసీహెచ్‌సీ డాక్టర్ ప్రభావతి పేర్కొన్నారు. బుధవారం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. అదేవిధంగా మందుల వివరాలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేసి కొరత లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ ఆనందమూర్తి, డాక్టర్ కీర్తి, డా. శృతి, డాక్టర్ శృతి భాగ్యం, డాక్టర్ యూసఫ్ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు పాటుపడుదాం



ర్యాలీ చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కార్వేటి నగరం : కార్వేటి నగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవంలో భాగంగా బుధవారం ప్రతిజ్ఞ, యూనిటీ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ దార్శనికత, చర్యల వల్ల భారతదేశ ఏకీకరణ సాధ్యమైందని తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి విద్యార్థుల చేత జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులు యూనిటీ రన్'కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం ఆచారి, డాక్టర్ సి ఎన్ లతా, డాక్టర్ సుబ్బారావు, కార్తీక్ , విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు మట్టి అక్రమ తరలింపు

విజయపురం : మహారాజపురం చెరువు నుంచి స్థానిక అధికార పార్టీ నాయకులు తమిళనాడుకు మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికులు ఆరోపించారు. ఓ స్థానిక నేత తన పొలానికి 10 ట్రిప్పులు చెరువు మట్టి కావాలని నీటి పారుదలశాఖ అధికారుల వద్ద అనుమతి తీసుకొన్నాడు. అయితే మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకు తమిళనాడు సరిహద్దు ప్రాంతాలకు మట్టిని తరలించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా అడ్డుపడిన వారిపై దౌర్జన్యానికి దిగినట్లు తెలిసింది. దీనిపై నీటిపారుదలశాఖ ఏఈని వివరణ కోరగా 10 ట్రిప్పులకే అనుమతి ఇచ్చామని, విచారించి తగు చర్యలు తీసుకొంటామని తెలిపారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



విజయపురం (వడమాలపేట) : మండలంలోని ఎస్‌బీఆర్ పురం కాలనీ ప్రధాన రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభానికి చెట్ల తీగలు అల్లుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చెట్ల తీగలు, ఏపుగా అల్లుకున్నాయి. ప్రధాన రోడ్డు పక్కన ఉండటంతో తీగకు విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు




రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న డీటీ ప్రవీణ్‌కుమార్

పాలసముద్రం : రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ అరుణకుమార్ తెలిపారు. బాలక్రిష్టాపురంలో రీ సర్వే డీటీ ప్రవీణ్‌కుమార్, మండల సర్వేయర్ గణేష్ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులందరూ ఈ సభల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం రైతుల నుంచి 45 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీభ, వీఆర్‌ఓ రమేష్, రైతులు పాల్గొన్నారు.

పండుగ పూట మద్యం డోర్ డెలివరీ!

విజయపురం : బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కూటమి ప్రభుత్వం పోలీసు అధికారులను హెచ్చరిస్తున్నా.. మద్యం షాపుల నిర్వాహకులు 'తగ్గేదేలే..' అంటున్నారు. మరో అడుగు ముందుకేసి.. ఏకంగా గ్రామాల్లో మద్యం డోర్ డెలివరీకి సిద్ధమయ్యారు. లాటరీ పద్ధతి ద్వారా ప్రభుత్వం మద్యం దుకాణాలను కేటాయించింది. ఈ కేటాయింపులో విజయపురం మండలానికి అయిదు దుకాణాలు మంజూరు చేశారు. ఈ ఐదు దుకాణాలు తప్ప ఎక్కడా బెల్ట్ షాపులు నిర్వహించరాదని పోలీసు, ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. వీటిని బేఖాతరు చేస్తూ, మద్యం షాపు నిర్వాహకులు స్థానిక అధికార పార్టీ నాయకులతో చేతులు కలిపి, మద్యాన్ని విచ్చలవిడిగా డోర్ డెలివరీకి సిద్ధం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపుతో అటు ప్రయాణికులు, ఇటు విద్యార్థులకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు మాత్రమే షాపు నిర్వహిస్తారు. ఆ తరువాత మద్యం బాబులకు ఏజెంట్ల ద్వారా ఫోన్ కాల్స్ ద్వారా మద్యాన్ని ఇంటికే చేరుస్తున్నారు. పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద షాపు మూసివేసిన తరువాత రాత్రి 10 నుంచి ఉదయం 10గంటల వరకు మద్యం అమ్ముతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులతో పీడీ

పుత్తూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు పుత్తూరు మండలం గొల్లపల్లి జడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థినులు ఇద్దరు ఎంపికైనట్లు హెచ్‌ఎం భారతి తెలిపారు. బుధవారం మంగళం ట్రెండ్స్ నందు జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పాఠశాల విద్యార్థినులు సుజాత, లోకేశ్వరీ రాష్ట్ర జట్టుకు ఎంపికై నట్లు వివరించారు. నవంబర్ 9వ తేదీ నుంచి 11వరకు జరిగే రాష్ట్ర పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీ గోపికృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

రీ సర్వే లోపాల గుర్తింపునకే గ్రామసభలు

కార్వేటి నగరం : రీ సర్వేలో లోపాలను గుర్తించడానికి గ్రామసభలు నిర్వహించడం జరుగుతోందని రీ సర్వే డీటీ స్వరూపరాణి పేర్కొన్నారు. బుధవారం ఎంఎం విలాసం పంచాయతీలో రీ సర్వే పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వే డీటీ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వేలో లోపాలను గుర్తించి రైతులకు న్యాయం చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నగరి డీఐఓ రవిశంకర్, మండల సర్వేయర్ బాబు పాల్గొన్నారు.

జోరుగా కలప అక్రమ రవాణా



ఎస్‌బీఆర్‌పురం సమీపంలో తరలించడానికి సిద్ధంగా కలప

విజయపురం (వడమాలపేట) : వడమాలపేట మండలంలో ఎక్కడ చూసినా పచ్చని చెట్లు ఆహ్లాదకరంగా కనిపిస్తుంటాయి. అయితే ఇతర ప్రాంతాలకు చెందిన కలప వ్యాపారులు వడమాలపేట సమీపంలో చెట్లను విచ్చలవిడిగా నరికివేస్తున్నారని, మామిడి చెట్లను తొలగించడానికి అనుమతి తీసుకొని, వివిధ రకాల చెట్లను నరికి వేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చీకటి పడగానే కలపను రోడ్డు మీద తరలిస్తున్నారని, అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

దీపావళి పండుగకు

సందడే సందడి



టపాసుల దుకాణాల వద్ద కిక్కిరిసిన కొనుగోలుదారులు

నగరి : యువతీ, యువకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే దీపావళి పండుగ వచ్చేసింది. సంప్రదాయ పండుగల్లో ఒక్కటైన దీపావళి కేవలం హిందువులే కాకుండా అన్ని మతాల వారూ బాణసంచా కాల్చి ఆనందంగా జరుపుకొంటారు. నియోజకవర్గంలో నగరి పట్టణంలో నివాస ప్రాంతాలకు దూరంగా కుశస్థలి నది సమీపంలోని మైదానంలో 9 దుకాణాలు, పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 7 దుకాణాలు, వడమాలపేట మండంలోని ఎస్‌ఆర్‌టీ కల్యాణ మండపం సమీపంలో నాలుగు దుకాణాలు ఏర్పాటు చేశారు. టపాసుల కొనుగోలుకు యువకులు ఆసక్తి చూపారు.దీంతో టపాసుల దుకాణాల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది.